మినీ కథ

# చిట్కా

శేషాద్రీ, నేనూ ఒకే సెక్షన్‌లో పనిచేస్తున్నాం. ఆయన నాకన్నా పదేళ్ళు పెద్దవాడు. జీవితంలో ఎత్తు పల్లాలు బాగా చవిచూసినవాడు. కావడానికి మధ్య తరగతి కుటుంబీకుడే అయినా ఎప్పుడూ హుషారుగా, హాయిగా, చింతలు లేని మనిషిలా ఉంటాడు.

శేషాద్రి స్నేహభావం, ఉపకార బుద్ధీ ఉన్న మనిషి. ముఖ్యంగా నాకు ఎన్నో సందర్భాల్లో ఎన్నో రకాలుగా ఉపకారం చేశాడు. నాతో తన కేదేనా అవసరం పడితే అరమరికలు లేకుండా అడిగేస్తాడు.

అతను పదేళ్ళ క్రితం హైదరాబాదులో జూబ్లీ హిల్స్‌లో ఇంటి స్థలం కొనుక్కున్నాడు. అప్పటి నుంచి ఇల్లు కట్టుకోవాలనుకొంటున్నా ఏవో ఆటంకాలు వచ్చి కట్టుకోలేకపోయాడు.

ఈ రోజుల్లో మధ్య తరగతి మనిషికి ఉండే కోరికలు రెండే. ఒకటి-పిల్లల్ని చదివించుకోడం; రెండు-ఇల్లు కట్టుకోడం.

శేషాద్రికి పరిస్థితులన్నీ అనుకూలంగా ఉన్నాయి. అందువల్ల ఇల్లు కట్టుకునేందుకు లోన్‌కు అప్లై చేశాడు. ఆఫీసు వాళ్ళు నానా హడావుడీ చేసి అరవై వేలు అప్పు ఇచ్చారు. ఈ రోజుల్లో అరవై వేలలో ఇల్లు కట్టుకోవడం ఎంత కష్టమో మీకూ, నాకే కాదు, ప్రభుత్వానికి కూడా తెలుసు. కాని ఏం చెయ్యలేని పరిస్థితి. దేశంలో చాలా మంది పేదరికంలో ఉన్నారనీ ప్రభుత్వానికి తెలుసు. దేశంలో చాలామంది నిరుద్యోగులున్నారనీ ప్రభుత్వానికి తెలుసు. అందరికీ అన్నీ తెలుసు. కాని ఎవరూ ఏవీ చెయ్యలేని పరిస్థితి.

అరవై వేలు ప్రభుత్వ లోన్ రాగానే శేషాద్రి ఇంకొంత అప్పుకోసం ప్రయత్నాలు ప్రారంభించాడు. అత్తగారు కొంత డబ్బు సర్దింది. బావమరిది కొంత డబ్బు సర్దాడు. చెల్లెలు, భర్త కొంత సహాయం చేశారు. ఎక్కడో విదేశాల్లో పనిచేస్తున్న తోడల్లుడు కొంత సొమ్ము పంపించాడు.

శేషాద్రి ఇల్లు కట్టడం ప్రారంభించాడు. డబ్బు ఖర్చవుతోంది. డబ్బు అవసరం పడుతోంది. డబ్బు వస్తోంది. డబ్బు వెడుతోంది. ఇంటి నిర్మాణంమాత్రం సాగుతోంది.

శేషాద్రికి మూర్తి అనే స్నేహితు డొకాయన ఉన్నాడు. వాళ్ళిద్దరిదీ ఒకటే ఊరు. ఆయన ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. ఆయనకి ఒంట్లో బాగుండని కారణంగా చాలాకాలంగా సెలవులో ఉన్నాడు. మూర్తిగారికి ఇద్దరు కొడుకులు. ఇద్దరూ మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. ఆయనకి ఇద్దరు కూతుళ్ళు. అందులో ఒకామెకి పెళ్ళి చేసి పంపేశాడు. రెండో ఆమెకి పెళ్ళి చెయ్యాలి.

ఇల్లు కట్టడం విషయంలో మూర్తిగారి సలహా సంప్రదింపు తీసుకునేవాడు శేషాద్రి. ఆయన ఇంజినీర్ కావడం ఒక కారణమైతే, ఆయన అంతకుముందు ఇల్లు కట్టడం మరో కారణం.

మూర్తిగారికి అర్జంటుగా శేషాద్రి సహాయం కావలసి వచ్చింది.

అనుకోకుండా మూర్తిగారి అమ్మాయికి సంబంధం కుదిరింది. కుర్రాడు మంచి ఉద్యోగంలో ఉన్నాడు. అతని తరపు వాళ్ళు వెంటనే పెళ్ళి చెయ్యమన్నారు.

మూర్తిగారు ఇబ్బందిలో పడిపోయారు. ఇబ్బంది అంతా డబ్బుగురించి...

ఆయన దగ్గర డబ్బు రెడీగా లేదు. కట్నం, లాంఛనాలు, పెళ్ళి ఖర్చులు-అన్నీ చూసుకోవాలి గదా! ఆయనకి ఇంటి పక్కనే ఖాళీ స్థలం ఉంది. అది అమ్మెయ్యాలనుకున్నారు గాని, టైం లేదు. అందులోనూ అర్జంటుగా అమ్మాలంటే రేటు తెగసి అడుగుతారు.

శేషాద్రి దగ్గర డబ్బు ఉంది. మూర్తిగారు శేషాద్రిని ఇరవై వేలు సర్దమని, పెళ్ళి అవగానే అప్పుచేసో, స్థలం అమ్మేసో అప్పు తీర్చేస్తానని చెప్పారు.

శేషాద్రి వెంటనే ఒప్పుకున్నాడు. ఇరవై వేలు బాంకు లోంచి తీసి ఇచ్చాడు.

పెళ్ళి జరిగింది. పిల్ల అత్తవారింటికి వెళ్ళింది.

మూర్తిగారు స్థలం బేరం పెట్టారు.

కాని...కాని...

ఆయనకి అనారోగ్యం ముదిరిపోయింది. హాస్పటల్లో చేర్చారు. పది రోజుల్లో ఆయన కన్ను మూశారు. మిగిలిన కార్యక్రమాలన్నీ పూర్తయి కాస్త నెమ్మదించాక శేషాద్రి మూర్తిగారి అబ్బాయిని, భార్యని డబ్బు విషయం అడిగాడు.

"ఆయన చెప్పారు-ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఇవ్వమనికూడా చెప్పారు" అంది మూర్తిగారి భార్య.

శేషాద్రి మనసు కుదుటపడింది.

శేషాద్రి ఇల్లు కట్టడం మెల్లగా సాగుతోంది. ఇటుక దొరికితే, ఇసుక దొరకదు. సిమెంటు దొరికితే, కూలీలు దొరకరు. పని ఇబ్బడి ముబ్బడిగా జరుగుతోంది.

శేషాద్రి మూర్తిగారింటికి వెడుతూనే ఉన్నాడు. డబ్బు అడుగుతూనే ఉన్నాడు. వాళ్ళు అదిగో, ఇదిగో అంటూనే ఉన్నారు.

రోజులు దొర్లిపోతూనే ఉన్నాయి. డబ్బుమాత్రం రాలేదు. శేషాద్రి దగ్గరున్న డబ్బంతా అయిపోయింది. ఇంటి నిర్మాణం ఆగిపోయింది. అతనికి మనశ్శాంతి లేదు. "అవసరానికి ఆదుకున్నాను. వాళ్ళ కామాత్రం కృతజ్ఞతకూడా లేదు" అన్నాడు.

డబ్బుకోసం వాళ్ళింటిచుట్టూ తిరుగుతూనే ఉన్నాడు.

"ఇచ్చేస్తాం. ఇవ్వక పారిపోతామా?" అని కూడా అందట మూర్తిగారి భార్య.

ఇద్దరు కొడుకులూ మంచి ఉద్యోగాల్లో ఉంటూ అతని అప్పు తీర్చడం లేదంటే నిర్లక్ష్యమే కారణం అనిపించింది.

శేషాద్రి ఓ రోజు తన బాధంతా నా దగ్గర చెప్పుకుని బాధపడ్డాడు. నేను వెంటనే అతని కో చిట్కా చెప్పాను. మరునాడు వాళ్ళింటి కెళ్ళి నేను చెప్పమన్నది చెప్పేసి వచ్చాడు.

మూడోనాటికల్లా మూర్తిగారి కొడుకు డబ్బుతెచ్చి శేషాద్రికి ఇచ్చేశాడు...

నేను చెప్పిన చిట్కా ఏమిటంటే-

"మీరు డబ్బు ఇవ్వనందువల్ల నా ఇల్లు ఆగిపోయింది. ఒకతను నెలకి నూటికి నాలుగు రూపాయల చొప్పున వడ్డీకి ఇరవై వేలు ఇస్తానన్నాడు. అది తెచ్చుకుని ఇంటిపని కానిస్తాను. మీరు డబ్బు తిరిగి ఇచ్చేటప్పుడు అదే రేటున. వడ్డీ ఇవ్వండి. అతనికి ఆ డబ్బు కట్టేస్తాను..."

-వీరభద్రరావ్ పమ్మి

## అసాధారణ మేధావి

విధి లీలలు విచిత్రమైనవి. సాధారణంగా వికలాంగులను చూసి మనం 'అయ్యో! పాపం!' అని సానుభూతి చూపుతుంటాము. ఒక్కొక్కసారి అలాంటి వికలాంగులే తమ అద్భుత నైపుణ్యం కనబరచి, మనం ముక్కున వేలేసుకునేలా చేస్తుంటారు. ఫ్రాన్సుకు చెందిన ఛార్లెస్ గ్రాండ్ మాంగే (1835-1895) చేతులూ, కాళ్ళూ లేకుండా జన్మించాడు. పుట్టినప్పుడు కేవలం ఒక పౌండు బరువు ఉన్నాడు. ఓ మాంసపు ముద్దలా, చూడడానికి పరమ వికృతంగా ఉన్న ఈ శిశువును చూసి భయపడుతుందేమో అని తల్లికి కూడా చూపించలేదు మాంగేను. అయితేనేం, ఆ అష్టావక్రుడే 19 వ శతాబ్దపు 'హ్యూమన్ కాలిక్యులేటర్'గా పేరు పొందాడు. అంగవైకల్యాన్నిచ్చి, మాంగేపట్ల కఠినంగా ప్రవర్తించిన ప్రకృతే, అతనికి అద్భుత మేధాశక్తి నిచ్చి నష్టపరిహారం చెల్లించింది. మాంగే నూరంకెలు ఉన్న రెండు సంఖ్యలను గుణించి ఫలితాన్ని ముప్పై సెకన్లలోగా చెప్పగలిగేవాడు. ఇరవైకి పైగా ఉన్న రెండు సంఖ్యలను పరస్పరం భాగిస్తే వచ్చే శేషాన్ని త్రుటికాలంలో తెలిపేవాడు. పేరుమోసిన గణకులు గంటల తరబడి పెనుగులాడినా సాధించలేని లెక్కలను నిమిషాల్లో తేల్చి పారేసే ఈ అసంపూర్ణ మానవుడు తన దైనందిన అవసరాలు తీర్చుకునేందుకు ఎవ్వరిమీదా ఆధారపడేవాడు కాదు. మేధాసంపత్తిని ప్రదర్శిస్తూ, జీవితకాలంలో మొత్తం యూరోపు ఖండాన్ని ఈ కొననుంచి ఆ కొనదాకా చుట్టేశాడు ఛార్లెస్ గ్రాండ్ మాంగే.



-బ్రహ్మ రఘురామరాజు